చందన్‌వెల్లి భూ నిర్వాసితుడి నామినేషన్



షాబాద్, ఏప్రిల్ 20: గత ప్రభుత్వంలో చందన్‌వెల్లి భూ నిర్వాసితులకు అన్యాయం జరిగిందని, నిర్వాసితులకు ఈ ప్రభుత్వం న్యాయం చేయాలనే డిమాండ్‌తో సంఘం అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు శనివారం చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. నిర్వాసిత రైతులతో కలిసి చందన్‌వెల్లిలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేసి, అనంతరం రాజేంద్రనగర్‌లోని ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.

ఉపశమనం!

ఉమ్మడి జిల్లాలో చల్లబడిన వాతావరణం

- కందుకూరులో 40మి.మీ వర్షపాతం నమోదు
- పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం
- దెబ్బతిన్న వరిచేలు, కూరగాయల పంటలు
- భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- పగలు 40 డిగ్రీల లోపే గరిష్ట ఉష్ణోగ్రతలు
- కందుకూరు, కడ్తాల్‌లో 20 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

వాతావరణంలో మార్పుల కారణంగా ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. నిన్నమొన్నటి వరకు ఎండ తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. రెండు మూడు రోజుల నుంచి ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ఈదురుగాలులతో అనేక చోట్ల పంటలకు నష్టం వాటిల్లింది. చెట్లు, విద్యుత్ స్తంభాలు, వైర్లు తెగి పలు చోట్ల పశువులు మృత్యువాత పడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది.

కీసరలో కురుస్తున్న వాన





మదన్‌పల్లి మార్గంలో కూలిన చెట్లు



కొత్తపల్లిలో రాలిన మామిడి



పడిపోయిన విద్యుత్ స్తంభం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/యాచారం/కొత్తూర్,ఆమనగల్లు/కడ్తాల/తలకొండపల్లి/బొంరాస్‌పేట/పెద్దేముల్/ధారూరు/కీసర: ఉమ్మడి జిల్లాలో నిన్నమొన్నటి వరకు ఎండలు ఠారెత్తించిన సంగతి తెలిసిందే. పగటి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరడంతో ప్రజలు ఎండ తీవ్రత, ఉక్కబోతలతో సతమతమయ్యారు. అయితే శుక్రవారం సాయంత్రం నుంచి ఉమ్మడి జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఎక్కడ చూసినా మబ్బులు కనిపిస్తున్నాయి. పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. ఈదురుగాలులతో అనేక చోట్ల పంట నష్టం జరిగింది. మహేశ్వరం, కందుకూరు మండలాల్లో నష్టం ఎక్కువగా ఉంది. పిడుగు పాటుకు ఒకరు మృతి చెందగా పశుసంపదకు నష్టం జరిగింది. గడిచిన 24 గంటల్లో రంగారెడ్డిజిల్లా కందుకూరులో 40మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది. అలాగే కడ్తాల్‌లో 36.8మి.మీ, శేరిలింగంపల్లిలో 28 మి.మీ, గచ్చిబౌలిలో 27మి.మీ, రాచలూరులో 26మి.మీ, రాజేంద్రనగర్‌లో 23మి.మీ, మణికొండలో 22 మి.మీ, మహేశ్వరంలో 20.8 మి.మీ వర్షం కురిసింది. ఇక వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లో 17మి.మీ, దోమలో 12.5మి.మీ వర్షపాతం నమోదైంది.





యాచారం మండలం నజ్దిక్‌సింగారం, దేవునిపడకల్‌లో చనిపోయిన ఆవులు

భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు

వాతావరణ మార్పులతో ఉమ్మడి జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలలోపే ఉండడం గమనార్హం. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో 39.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లా బంట్వారంలో అత్యధికంగా 39.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో అత్యధికంగా 37.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక రాత్రిపూట ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా తగ్గిపోయాయి. కందుకూరు, కడ్తాల్ మండలాల్లో 20 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అనేక మండలాల్లో కనిష్ఠఉష్ణోగ్రతలు 20 నుంచి 25 డిగ్రీలలోపుగానే నమోదయ్యాయి. గడిచిన నెల రోజుల్లోనే పగటి, రాత్రిపూట ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదుకావడం గమనార్హం.



బొంరాస్‌పేట మండలం మదన్‌పల్లిలో గాలికి లేచిపోయిన కృష్ణయ్య ఇంటి పైకప్పు

ఈదురుగాలుల వాన

వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండలంలోని మదన్‌పల్లి, మదన్‌పల్లి తండా పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మదన్‌పల్లి నుంచి మదన్‌పల్లి తండా వరకు రోడ్డుపై చెట్లు విరిగి పడ్డాయి. మదన్‌పల్లి నుంచి ధారూర్ మండలం నాగారం వెళ్లే దారిలో చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. అధికారులు జేసీబీల సహాయంతో చెట్లను తొలగించారు. పెద్దేముల్ మండలంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. కోతకు వచ్చిన వరి చేను వర్షం దాటికి గింజలు రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మేడ్చల్ జిల్లా కీసరలో శనివారం వర్షం కురియడంతో వాతావరణం చల్లబడింది. చేతికొచ్చిన పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొట్టుకుపోయిన ఇంటి కప్పులు

బొంరాస్‌పేట్ మండలంమదన్‌పల్లిలో ఈదురు గాలులు, వర్షం ధాటికి గ్రామానికి చెందిన కృష్ణయ్య ఇంటి పై కప్పు రేకులు లేచిపోయాయి. ధారూరు, పరిసర గ్రామాల్లో శనివారం ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. పీసీఎం తండాలో చెట్లు నేల కూలాయి. పాఠశాల పక్కన ఉన్న చెట్టు కూలి భవనంపై పడింది. పక్కనేఉన్న తాగునీటి ట్యాంకు పాక్షికంగా దెబ్బతిన్నది. విద్యుత్‌స్తంభాలు, విద్యుత్ తీగలు కిందపడి సరఫరాకు అంతరాయం కలిగింది. కిషన్‌పల్లిలోమల్లేష్, వెంకయ్య, శ్రీనివాస్‌ల పశువులకొట్టం, బానాల శ్రీనివాస్‌కు చెందిన మేకల దొడ్డి కూలింది.

దెబ్బతిన్న పంటలు

యాచారం మండలంలో శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులు, వర్షంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. కొత్తపల్లి, మాల్, తమ్మలోనిగూడ, నందివనపర్తి, నజ్దిక్‌సింగారం, తాటిపర్తి తమ్మలోనిగూడ, కొత్తపల్లి, నజ్దిక్‌సింగారంలో గాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. ఈదురు గాలులకు వరిచేను నేలకొరిగింది. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో గాలులకు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. వరిచేలు, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. గ్రామాల్లో మామిడి కాయలు నేల రాలాయి.

పిడుగుపాటుకు పశువుల మృత్యువాత

యాచారం మండలం నజ్దిక్‌సింగారంలో నర్సింహారెడ్డి తన రెండు జర్సీ ఆవులను పొలం వద్ద చెట్టుకింద కట్టేయగా పిడుగుపడి మృతి చెందాయి. వాటి విలువ రూ.1.2 లక్షలు ఉంటుందని రైతు రోదించాడు. కొత్తూర్ మండలం కొడిచర్లలో శుక్రవారం రాత్రి పిడుగు పాటుకు ఆవు, లేగదూడ మృతి చెందాయి. రైతు చెర్నెడ్డి చెన్నారెడ్డి పొలం వద్ద పశువులను కట్టేయగా పిడుగుపాటుతో పశువులు మృతి చెందాయి. ఆవు, లేగ విలువ రూ.లక్షకుపైగా ఉంటుందని రైతు చెన్నారెడ్డి తెలిపాడు. సంఘటనా స్థలాన్ని పశువైద్యాధికారి స్ఫూర్తి, ఆర్ఐ వాసుదేవరెడ్డి పరిశీలించారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపడి, పిడుగు పాటుకుతో నాలుగు పశువులు మృతి చెందాయి. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలో పిడుగుపడి దొడ్డమోని సత్యనారాయణకు చెందిన ఆవు మృతిచెందింది. రైతుకు ఎంపీటీసీ మంగమ్మ పరామర్శించి రూ.5వేల సాయం అందజేశారు. తలకొండపల్లి మండలం దేవుని పడకల్‌లో ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడి కుమ్మరి రవికి చెందిన రెండు ఆవులు మృతిచెందాయి. వాటి విలువ రూ.1.6లక్షలు ఉంటుందని రైతు తెలిపాడు. కడ్తాల మండలం రావిచెడ్‌లో కల్లూరి రవీందర్‌కు చెందిన ఆవు పిడుగు పాటుకు మృతి చెందింది.

మూడో రోజు 13 నామినేషన్లు

- ఆర్వోలు శశాంక, గౌతమ్‌లకు నామినేషన్ పత్రాలు సమర్పించిన అభ్యర్థులు



చేవెళ్ల స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ఎస్పారి సూర్యప్రకాశ్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, మేడ్చల్/రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 20): చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాలకు నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. చేవెళ్ల స్థానానికి మొదటి రోజు మూడు, రెండో రోజు మూడు నామినేషన్లు దాఖలు కాగా మూడో రోజు శనివారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి శశాంకకు అందజేశారు. నామినేషన్ వేసిన వారిలో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు ఉండగా మరో ముగ్గురు వివిధ పార్టీలకు చెందిన వారు ఉన్నారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్(సెక్యులర్) పార్టీ నుంచి మహ్మద్ సలీమ్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయనే స్వతంత్ర అభ్యర్థిగానూ మరో నామినేషన్ దాఖలు చేశారు. ఎస్పారి సూర్యప్రకాశ్‌రెడ్డి, నీరటి ఆంజనేయులు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. ధర్మసమాజ్ పార్టీ నుంచి తోట్ల రాఘవేందర్, ప్రజావెలుగు పార్టీ నుంచి టి.దుర్గప్రసాద్ నామినేషన్లు సమర్పించారు. మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి మూడో రోజు ఏడు నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. బీజేపీ నుంచి ఈటల రాజేందర్, ఆయన భార్య ఈటల జమున, ప్రజా వెలుగు పార్టీ నుంచి లోగరి రమేష్, ధర్మ సమాజ్ పార్టీ నుంచి బోయిన దుర్గా ప్రసాద్‌యాదవ్, స్వతంత్ర్య అభ్యర్థులుగా పెండ్యాల సాయి వరప్రసాద్, పెసరికాయల పరిక్షిత్‌రెడ్డి, కంటే సాయన్నలు నామినేషన్‌లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.


మీడియా సెంటర్ ఏర్పాటు

ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ల పార్లమెంటుస్థానానికి సంబంధించి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు.

పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రం

సీ-విజిల్ యాప్!

- ఎన్నికల్లో జరిగే అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదుకు వేదిక
- ఆధునికీకరణతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం
- 100 నిమిషాల్లో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ
- జిల్లాలో సీ-విజిల్ ద్వారా ఇప్పటి వరకు 80 ఫిర్యాదుల పరిష్కారం





(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): ఎన్నికల్లో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజిల్ యాప్ పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా మారింది. ప్రస్తుతం ఈ యాప్‌ను ఆధునీకరణతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం చేశారు. అక్రమాలకు సంబంధించిన ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 100 నిమిషాల్లో దర్యాప్తు చేసి ఫిర్యాదుదారుడికి సమాచారం తెలియజేస్తారు. ఈ సమాచారం జిల్లా ఎన్నికల అధికారితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చేరుతుంది. ఎవరైనా కోడ్‌ను ఉల్లంఘించినా, వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు ఓటర్లను డబ్బు, మద్యం, బహుమతుల వంటివి ఇచ్చి ప్రలోభాలకు గురిచేసినా ఈ వివరాలను నేరుగా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. అలాగే ఎన్నికల ప్రచారంలో అనుమతులు లేకుండా లైడ్ స్పీకర్ వాడటం ఇతర నిబంధనలు ఉల్లంఘించినా, కులమతాలను రెచ్చగొట్టె వ్యాఖ్యలు చేసినా, ర్యాలీలు తీసినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు.

యాప్‌తో నేరుగా ఫిర్యాదు

స్మార్ట్ ఫోన్లలో సీవిజిల్ యాప్‌లో కేంద్ర ఎన్నికల సంఘానికి కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయొచ్చు. స్మార్ట్ ఫోన్లలో సీ-విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని భాషను ఎంపిక చేసుకొని టిక్ చేయాలి. అనంతరం ఈ యాప్ స్మార్ట్ ఫోన్ స్ర్కీన్‌పై కనిపిస్తుంది. ఆ తర్వాత సెల్‌నంబర్‌కు ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఓటీపీ ఎంటర్ చేసిన అనంతరం వినియోగదారుడి పూర్తి వివరాలు వస్తాయి. అనంతరం ఫోన్‌లో యాప్ ఓపెన్‌అవుతుంది. దీనిలో కోడ్ ఉల్లంఘనలపై ఫొటో లేదా వీడియోలు అప్‌లోడ్ చేస్తే ఫిర్యాదు చేస్తే వెంటనే ఎన్నికల అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని 100 నిమిషాల వ్యవధిలో దర్యాప్తుచేసి చర్యలుతీసుకుంటారు. యాప్ వివరాలకు 1950కికాల్ చేయొచ్చు

ఇప్పటి వరకు 80 ఫిర్యాదుల పరిష్కారం

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి సి-విజిల్ ద్వారా మొత్తం 80 ఫిర్యాదులను స్వీకరించారు. అందులో 46డీసీసీ ద్వారా తొలగించగా, ఆర్వో ద్వారా 15 ఫిర్యాదులు తొలగించారు. 19 ఫిర్యాదుల్లో ఒకటి తప్పుడు ఫిర్యాదుగా తేల్చారు. మిగిలిన 18 ఫిర్యాదులను పరిష్కరించారు.

సాగులో అధిక దిగుబడులకు

భూసార పరీక్షలు తప్పనిసరి

- మట్టి నమూనాల సేకరణలో మెలకువలు పాటించాలి : ఏవో తులసి



పరీక్షల కోసం సేకరించిన మట్టి నమూనా ప్యాకెట్లు

కానుగ జిల్లేడు, వాయిలి ఆకులను మాగాణి భూముల్లో తొక్కడం, పంట మార్పిడి పద్ధతులతో చాలా వరకు రైతులు పొలాల్లో పోషక సమతుల్యత దెబ్బతినకుండా పంటపంటకు చేసేవారు.

చేవెళ్ల, ఏప్రిల్ 20 : భూమిలో సారం పెంచేందుకు పాత పద్ధతులు మాని రసాయనిక ఎరువులు వాడుతున్నారు. దీంతో భూమిలో పోషక విలువలు దెబ్బతిని భూమి నిర్జీవమై దిగుబడులు తగ్గుతున్నాయి. భూమిలోని పోషకాలు ఇతర గుణాలు తెలుసుకోవడానికి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి తులసి తెలిపారు. భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. ఆమె ఏమన్నారంటే.. భూమిలో బలాన్ని పెంచేందుకు పూర్వకాలంలో రకరకాల పద్ధతులు పాటించేవారు. పశువుల ఎరువులు వేడయం, మిశ్రమ పంటలు ఒకే పొలంలో పండించడం, జనుము, పెసర, మినుము వంటి పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నేవారు. చెరువుల్లోని ఒండ్రు మట్టిని పొలాల్లో వేయడం, గొర్రెలు, పశువుల మందలను పెట్టడం వంటివి చేసేవారు. భూమికి బాలన్నిచ్చే కంది, మినుము, గడ్డి నువ్వులు మొదలైన పంటలు వేయడం,

మట్టి నమూనాల సేకరణలో స్థల ఎంపిక..

మట్టి పరీక్షకు సరైన మట్టి నమూనా తీయడం ముఖ్యమైన విషయం. తీసిన మట్టి నమూనాలు పొలంలోనే మట్టిలోని లవనాలు ప్రతిబింబించేలా ఉండాలి. పొలంలో పంట లేని సమయం, ప్రస్తుత సమయాల్లో మట్టి నమూనాలు తీయాలి. భూమి రకం, రంగు, ఎత్తుపల్లాలు, పంట దిగుబడిలోని తేడాల ఆధారంగా వేర్వేరు నమూనాలను తీయాలి. తక్కువ విస్తీర్ణంలోని పొలంలో అయినా సరే, ఒకే పొలంలో తేడాలు కనిపిస్తే వేర్వేరుగా సమూనాలు తీయాలి. మట్టి నమూన తీయాలనుకున్నప్పడు ప్రతీ ఎకరా విస్తీర్ణంలో 10-12చోట్ల నమూనాలు తీయాలి.

ఇలా చేయాలి

సేకరించిన మట్టిలో చెత్త లేకుండా చూసుకోవాలి. 'వి' ఆకారంలో సుమారు 8-10 ఇంచ్‌ల లోతు వరకు గుంతలు తీయాలి. 'వి'ఆకారంలో ఒక పక్క అంచు నుంచి పైనుంచి కింది వరకు ఒకే మందంలో పల్చటి పొర వచ్చేలా మట్టి తీయాలి. ఎంపిక చేసుకొన్న 10-12 స్థలాల్లో మట్టి నమూనాలు తీసుకోవాలి. తీసిన మట్టిని పల్చని గోనె సంచుల్లో లేదా బట్టల్లో వేయాలి. రొట్టె ఆకారంగా గుండ్రంగా చేసిన మట్టి మీద మధ్యలో ఒక అడ్డ గీత, ఒక నిలువు గీత గీయాలి. ఇలా గీసిన తరువాత ఏవైనా రెండు కుప్పల మట్టిని తీసుకొని పరీక్షకు పంపాలి. ఇలా అర కిలో మట్టి అయ్యే వరకు గుండ్రంగా చేసుకుంటూ ఎదురెదురు కుప్పల(గదుల్లో) మట్టిని తీసుకుంటూపోవాలి. మట్టి అర కిలో అయ్యే వరకు ఇలా చేస్తుండాలి. ఒక శుభ్రమైన బట్ట సంచిలో అర కిలో మట్టివేయాలి. పాలిథీన్ సంచిని మట్టి నమూనాకు వాడొద్దు. చెట్ల కింద, రాళ్ల, గట్ల కింద కంచల దగ్గర, కాలి బాటలో మట్టి తీయొద్దు. పొలంలో పశువులను కట్టెసే స్థలాల్లో, చేనులో ఎరువుల కుప్పలు వేసిన స్థలంలో, రసాయనిక ఎరువులు వేసిన 4-5రోజుల్లో మట్టి నమూనా సేకరించొద్దు. శుభ్రమైన మట్టినే సేకరించాలి.

భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలి



రైతులు మట్టి నమూనాలు సేకరించిన తెల్లకాగితంపై వివరాలు, సర్వే నంబరు రాసి మట్టి సంచితో రాజేంద్రనగర్‌లోని వ్యవయసాయ యూనివర్సిటీలోని భూసార పరీక్ష కేంద్రంలో నేరుగా అందజేయాలి. రైతులు ఎక్కువ మంది ఉంటే చేవెళ్లలోని వ్యవసాయ కార్యాలయంలో ఇస్తే మట్టిని పరీక్ష కేంద్రానికి తరలిస్తాం.

- తులసి, మండల వ్యవసాయ అధికారి, చేవెళ్ల

వృథాగా మిషన్ భగీరథ నీరు



చౌదరిగూడలో వృథాగా పోతున్న ట్యాంకు నీరు

చౌదరిగూడ, ఏప్రిల్ 20: ఒక వైపు ఎండకాలం తాగునీరు లేక ప్రజలు విలవిలలాడుతూ ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఉంటే మరో వైపు మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిండి నీరు వృథాగా పోతున్న అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించి వదిలేస్తున్నారు. అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం చౌదరిగూడ బస్టాండ్ వెనకాల ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిండి వాటర్ రోడ్డుపై వృథాగా పోతుందని ప్రజలు తెలుపుతున్నారు. బస్టాండ్ లోంచి తాగునీరు వృథాగా పోతున్నా మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది మాత్రం పట్టించుకోలవడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించినా ఆచరణలో అమలు కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు మిషన్ భగీరథ నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చిలుకూరులో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



స్వామివారికి గోప వాహన సేవ ఊరేగింపు

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 20 : చిలుకూరులో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మండల పరిధి చిలుకూరు బాలాజీ ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు సాయంత్రం గోప వాహనం, హనుమంతుని వాహన ఊరేగింపు తదితర కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను వీక్షించేందుకు భక్తులు తరలివచ్చారు. గరుడ ప్రసాదం కోసం భక్తులు శుక్రవారం అధిక సంఖ్యలో తరలివచ్చిన సంగతి తెలిసిందే. దీంతో అప్రమత్తమైన ఆలయ సిబ్బంది బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం కావడంతో చిలుకూరు బాలాజీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

అటవీ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించం

బషీరాబాద్, ఏప్రిల్ 20: అటవీ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించబోమని తాండూరు డివిజన్ అటవీశాఖ అధికారి శ్యాంసుందర్‌రావు హెచ్చరించారు. మండలంలోని నీళ్లపల్లి- మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌లో శనివారం సెక్షన్ అధికారి అన్వర్ హుస్సేన్ ఖాన్, సిబ్బందితో కలియ తిరిగారు. వేసవి దృష్ట్యా చెట్లను నరికి అటవీ భూముల్లో సమీప గ్రామాల రైతులు, కర్ణాటక ప్రాంత గిరిజన తండాల రైతులు కబ్జాలకు పాల్పడే అవకాశం ఉన్నందున పరిశీలిస్తున్నామన్నారు. తెలంగాణ- కర్ణాటక అటవీ ప్రాంత సరిహద్దులు తేలకపోవడంతో అటవీ భూముల రక్షణకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పలుమార్లు కర్ణాటక రైతులు కొందరు తమ అటవీ ప్రాంతమంటూ గొడవలకు దిగుతుండటంతో కబ్జాలను అడ్డుకుంటూ వస్తున్నమన్నారు. తెలంగాణ అటవీ ప్రాంతం సర్వే నంబర్ 20లో మన భూములు ఉన్నాయని అక్కడా ఆక్రమణలు జరగకుండా ప్రత్యేక నిఘాపెట్టినట్లు తెలిపారు. అటవీ ప్రాంతలో చెట్లను నరికిన, సహజ వనరుల దోపిడీకి పాల్పడిన క్రిమినల్ కేసులు పెడతామన్నారు. అనంతరం రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో తిరుగుతూ చెట్లు, వనరులను స్వయంగా గుర్తించారు. ఆయన వెంట స్ట్రాకింగ్ ఫోర్స్ కానిస్టేబుల్ వీరేశం, సిబ్బంది నర్సింహులు పాల్గొన్నారు.



నీళ్లపల్లి-మైల్వార్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పరిశీలిస్తున్న రేంజర్ శ్యాంసుందర్‌రావు

లక్ష్యం, పట్టుదలతోనే విజయం

● లక్ష్యసాధనకు పేదరికం అడ్డు కాదు.. ● ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి ● 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో సివిల్స్ ర్యాంకర్(231) తరుణ్



ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న తరుణ్, పక్కన తల్లిదండ్రులు

వికారాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) /పూడూరు : లక్ష్యం, పట్టుదల, కష్టపడే తత్వం ఉంటే సాధించలేనిదంటూ ఏమీ లేదు.. లక్ష్యసాధనకు పేదరికం అడ్డు రాదు.. కఠోర శ్రమ ముందు పేదరికం తలవంచాల్సిందేనని వికారాబాద్ జిల్లా పూడూరు మండలం, మంచన్‌పల్లి గ్రామానికి చెందిన తరుణ్ నిరూపించాడు. కూలి పనులు చేసుకుంటూ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను కళ్లారా చూసిన తరుణ్.. చిన్నతనంతోనే సివిల్స్ సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడు. ఇటీవల ప్రకటించిన యూపీఎస్సీ ఫలితాల్లో 231వ ర్యాంకు సాధించారు. తల్లిదండ్రుల దీవెనలు, బాబాయిల సహకారం, ప్రోత్సాహంతోనే ఈ ఘనత సాధించానని, ఈ విజయాన్ని వారికే అంకితం ఇస్తున్నానని తరుణ్ చెప్పుకొచ్చారు. యూట్యూబ్, వెబ్‌సైట్లలో సివిల్స్‌కు సంబంధించిన పలు అంశాలను అధ్యయనం చేశారు. 22 ఏళ్ల వయస్సులో తొలి ప్రయత్నంలోనే సివిల్స్‌కు ఎంపికై అందరి అభినందనలు చూరగొంటున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : మీ కుటుంబ నేపథ్యం?

తరుణ్ : అమ్మా, నాన్న, చెల్లెలు ఉన్నారు. ముగ్గురు బాబాయిలు. వారంతా చిన్నప్పటి నుంచి చదువులో ప్రోత్సహించారు. రైల్వేస్‌లో లోకో పైలెట్‌గా పనిచేసే బాబాయితో పాటు మిగతా ఇద్దరు బాబాయిలు కూడా ఎప్పుడూ ప్రోత్సహించేవారు. మాకు ఎకరంన్నర పొలం ఉంది. పదో తరగతి వరకు బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివాను. రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, అజీజ్‌నగర్‌లోని విద్యాజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీజేఐటీ)లో బీటెక్ పూర్తి చేశా. సివిల్స్‌కు సొంతగా సిద్ధమయ్యా.

ఆంధ్రజ్యోతి : సివిల్స్‌ను లక్ష్యంగా ఎందుకు పెట్టుకున్నారు? ప్రిపరేషన్ ఎలా సాగింది?

తరుణ్ : 8వ తరగతి చదువుతున్న సమయంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హెచ్‌పీఎస్‌కు వచ్చారు. ఆయన్ను చూసిన తర్వాత ఎలాగైనా ఐపీఎస్ సాధించాలనుకున్నా. ఐపీఎస్ కంటే ఐఏఎస్ పెద్ద పోస్ట్ అని తెలుసుకుని అదే టార్గెట్‌గా పెట్టుకున్నా.. ఐఏఎస్ లేదా ఐపీఎస్ ఏదీ వచ్చినా చాలనుకున్నా. ఇంటర్ ముగియగానే సివిల్స్‌కు సన్నద్ధమయ్యేందుకు ఏర్పాట్లు చేసుకున్నా. బీటెక్ ఫస్ట్‌ియర్ చదివే సమయంలో కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో రెండేళ్ల పాటు బీటెక్ పరీక్షలకు సన్నద్ధమవుతూనే.. మరోవైపు సివిల్స్‌కు సిద్ధమయ్యా. ప్రత్యేకంగా ఎక్కడా కోచింగ్ తీసుకోలేదు. యూట్యూబ్ చాలా ఉపయోగపడింది. బాలలత మేడం చెప్పిన పలు అంశాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. రోజూ 5, 6 గంటలు చదివాను. బీటెక్ పూర్తికాగానే సివిల్స్‌కు హాజరై మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించా. 231వ ర్యాంక్ రావడం సంతోషంగా ఉంది.

ఆంధ్రజ్యోతి : సమాజానికి ఎలాంటి సేవ చేద్దామనుకుంటున్నారు?

తరుణ్ : నాకు ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా విద్య, ఆరోగ్యంపై ఎక్కువగా దృష్టి సారిస్తా. పేదలు, ఆడ పిల్లలు ఉన్నతంగా చదువుకునేందుకు వీలుగా నావంతు ప్రయత్నం చేస్తా.

ఆంధ్రజ్యోతి : యువతకు మీరిచ్చే సందేశం?

తరుణ్ : మీకున్న లక్ష్యాల గురించి ఇతరులకు చెప్పకండి. అనుకున్నది సాధించలేకపోతే ఇబ్బంది పడటంతో పాటు ఎగతాళికి గురికావాల్సి వస్తుంది. మన మీద మనకే నమ్మకం కోల్పోతాం. నా లక్ష్యం గురించి నేను బయటి వారెవరికీ చెప్పలేదు. మా కుటుంబ సభ్యులు, కొందరు మిత్రులకు మాత్రమే తెలుసు.

కష్టానికి తగిన ఫలితం లభించింది

తరుణ్‌ను చదివించడానికి కష్టపడాల్సి వచ్చింది. అప్పులు కూడా చేశాం. సివిల్స్ రిజల్ట్ చూడగానే కష్టానికి తగ్గ ఫలితం దక్కిందనిపించింది. ఆర్థికంగా సహకారం అందించిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు. సివిల్స్‌లో తరుణ్ మంచి ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉంది.

- శశికళ, బాబయ్య, తరుణ్ తల్లిదండ్రులు

విద్యుత్ అంతరాయం

కొడంగల్ రూరల్: రుద్రారంలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఈనెల 21 నుంచి 24 వరకు ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ నవీన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ.. రూ.98వేలు స్వాధీనం


నగదును చూపిస్తున్న ఎస్సై శ్రీశైలం యాదవ్

దౌల్తాబాద్, ఏప్రిల్ 20: మండలంలోని చంద్రకల్ చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో శనివారం రూ.98వేలు పట్టుబడ్డాయి. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేశామని, ప్రతీ ఒక్కరూ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలను పాటించాలని ఎస్సై శ్రీశైలం యాదవ్ తెలిపారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి


బంగారు మైసమ్మ ఆలయం వద్ద ప్రచార రథానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, ఏప్రిల్ 20 : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని ధర్మసాగర్ సమీపంలోని బంగారు మైసమ్మ ఆలయం వద్ద బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథాలకు పార్టీ నాయకులతో కలిసి పూజ చేశారు. అనంతరం రావులపల్లి, ముడిమ్యాల్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. మండలాధ్యక్షుడు ప్రభాకర్, సీనియర్ నాయకులు అనంత్‌రెడ్డి, వెంకటేశ్, మహేశ్, ఉరేళ్ల చందు, చింటు, ఎల్లయ్య, నర్సింలు, కృష్ణ తదితరులు ఉన్నారు.

డిగ్రీ ఫస్టియర్ సెమిస్టర్-1 పరీక్ష ఫీజు చెల్లించాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 20: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్ -1 పరీక్ష ఫీజు మే 6వ తేదీలోపు చెల్లించాలని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. ప్రభ, అభ్యాసక సహాయ కేంద్రం కో ఆర్డినేటర్ డా.జి.నాగోజీలు తెలిపారు. బీఏ, బీకాం విద్యార్థులు పేపరుకు రూ.150 చొప్పున చెల్లించాలన్నారు. బీఎస్సీ కంప్యూటర్స్ విద్యార్థులు పేపరుకు రూ.150, ప్రాక్టికల్ పరీక్షలకు అదనంగా రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కాగా, పరీక్షలు మే 26 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరుగుతాయని ఆయన తెలిపారు.

దేశంలో ప్రాభవం కోల్పోయిన బీజేపీ

- దేశంలో ప్రాంతీయ పార్టీలదేపై చేయి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 20 : దేశంలో బీజేపీ ప్రాభవం కోల్పోయిందని, ప్రధాని మోదీ ఆకర్షణ తగ్గిందని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వెయ్యి జాకీలు పెట్టినా లేచేలా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీ గార్డెన్‌లో శనివారం బీఆర్ఎస్ కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహకంలో భాగంగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం నిర్వహించారు. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో జాతీయ మీడియాను ఆధీనంలో ఉంచుకొని మోదీ, అబద్ధాలను ప్రచారం చేసి ప్రజలను నమ్మిస్తున్నారని, కాంగ్రెస్ ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేస్తూ కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయని మండిపడ్డారు. ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తామంటున్న సీఎం.. అప్పటి వరకు ఉంటే కదా అని అన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు ప్రజా సమస్యలపై అవగాహన లేదన్నారు. జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌ను వీడనని, తనపై కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్న మీడియాపై పరువు నష్టం దావా వేస్తానన్నారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఎంపీగా ఆదరించి గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజల గొంతుకనవుతానన్నారు. అదేవిధంగా అవగాహన లేని వ్యక్తులు, స్థానికేతరులను నమ్మి ప్రజలు మోసపోవద్దని ఆయన అన్నారు.

మీడియాపై సింగిరెడ్డి ధ్వజం


ఆమనగల్లు పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మీడియాపై నిరంజన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాన మీడియా సంస్థలన్నీ వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్‌ను కాకుల్లా పొడిచిన మీడియా.. ప్రస్తుతం సీఎం రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వవైఫల్యాలపై ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కొన్ని మీడియా సంస్థలు బీఆర్ఎస్‌పై విషప్రచారం సాగిస్తున్నాయని ఆక్రోశం వెల్లగక్కారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి చాడ కిషన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సత్యం, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు అభిలాష్‌రావు, రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, వాల్యానాయక్, ఉప్పల వెంకటేశ్ జడ్పీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా కొడంగల్ బస్టాండ్


బస్టాండ్ ఆవరణలో చెత్తాచెదారం

కొడంగల్, ఏప్రిల్ 20: కొడంగల్ ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ప్రతీరోజు చెత్తచెదారాన్ని శుభ్రం చేసే సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోవడంతో పనులు మానేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. బస్టాండ్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు ఆర్టీసీ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ప్రయాణికులు ఆరోపించారు. తాండూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ నిర్లక్ష్యంగా వహిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పరమేశ్వర్‌రెడ్డి



పరిగి, ఏప్రిల్ 20: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పూడూరు మండలం చీలాపూర్ గ్రామానికి చెందిన ఎం.పరమేశ్వరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు నగరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ది మోసం.. బీఆర్ఎస్‌ది దోపిడీ

- బీజేపీతోనే అభివృద్ధి : కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- జోరుగా లోక్‌సభ ఎన్నికల ప్రచారం


ధారూరు : సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

ధారూరు, ఏప్రిల్ 20: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచి అప్పులపాలు చేసిందని, బీజేపీని గెలిపిస్తే దేశం, రాష్ట్రం బాగుపడుతుందని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ధారూరులో శనివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీలను అమలు చేయటంలేదని ఆరోపించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, నెలకు రూ.4వేల పించన్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద రోడ్లు, రైతువేదికలు, శ్మశాన వాటికలు, మరుగుదొడ్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన నిధులేనని, వాటిని తాము చేసినట్లు గతంలో బీఆర్ఎస్ ప్రజలను నమ్మించిందని, పదేళ్లలో తెలంగాణను సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు. భారతదేశమంతా మరోసారి మోదీ సర్కార్‌ను కోరుకుంటుందని, చేవెళ్ల నుంచి తనను గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానని కొండా హామీ ఇచ్చారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు. జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్, పాండుగౌడ్, విశ్వనాథం, రాజేందర్‌గౌడ్, రాజునాయక్, ఉమాపార్వతి, వి.నందు, సాయిగౌడ్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం


పెద్దేముల్ : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రమేష్

పెద్దేముల్ : బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, అభివృద్ధిని కోరుకునేవారు బీజేపీకే ఓటు వేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్ అన్నారు. పెద్దేముల్ మండలంలోని పెద్దేముల్, మారెపల్లి గ్రామాల్లో శనివారం పర్యటించి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పెద్దేముల్ సమీపంలోని చెరువులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. బీజేపీకి ఓటువేసి మరోసారి మోదీని ప్రధానిని చేయాలని అభ్యర్థించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, మండలాధ్యక్షుడు హరీష్ గౌడ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి సాహుశ్రీలత, మండల మాజీ అధ్యక్షులు సందీప్‌కుమార్, కందనెల్లి నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి

మోమిన్‌పేట్ : విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఎల్.లక్ష్మారెడ్డి ఓటర్లను కోరారు. శనివారం మోమిన్‌పేట్ మండలంలోని టేకులపల్లి, ఎన్కతల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దేశ ప్రజలు మరోసారి మోదీని ప్రధాని చేయాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. నాయకులు బ్రహ్మంచారి, కృష్ణారెడ్డి, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరేస్తాం

చేవెళ్ల : చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరేస్తామని ఆ పార్టీ చేవెళ్ల మండలాధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.అనంత్‌రెడ్డి తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని పలు కాలనీల్లో నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఎం.వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలు చేపట్టాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ జీఎస్ చౌహాన్ తదితరులు

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 20 : దేశాభివృద్ధికి ప్రస్తుత తరుణంలో పరిశోధనలతో పాటు పరిశోధనా కార్యక్రమాలు ఎంతో ముఖ్యమని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని యూజీసీ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ జీఎస్ చౌహాన్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్ పరిధిలో గల చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో శనివారం ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రచించిన 'సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎకో టూరిజం ఇన్ ఇండియా విత్ స్పెషల్ రిఫరెన్స్ టూ నార్త్ తెలంగాణ' అనే పుస్తక అవిష్కరణలో కార్యక్రమంలో చౌహాన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు పరిశోధనలపై శ్రద్ధపెట్టాలని సూచించారు. యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి, రిజిస్టార్ ఆచార్య రవీందర్, డీన్ రాజు, అధ్యాపక బృందంతో పాటు పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజనీర్లు ప్రపంచానికి మార్గదర్శకులు కావాలి

- హైకోర్టు జడ్జి వేణుగోపాలరావు


విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న జస్టిస్ వేణుగోపాలరావు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 20 : ఇంజనీర్లు సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలు చేపట్టి ప్రపంచానికి మార్గదర్శకులుగా ఉండాలని హైకోర్టు జడ్జి వేణుగోపాలరావు అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన 13వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ... సాంకేతిక రంగంలో సేవలందించే ఇంజనీర్లు సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. జేఎన్‌టీయూహెచ్ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ అరుణ కుమారి మాట్లాడుతూ ప్రపంచానికి కావాల్సిన ఇంజినీర్లను తయారు చేస్తున్న విద్యాసంస్థల్లో నర్సింహారెడ్డి కళాశాల కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు జడ్జితో కలిసి అరుణకుమారి పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, డైరెక్టర్ ఎ.మోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ లోకనాథం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలి

- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల, ఏప్రిల్ 20 : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో చేవెళ్ల మండలంలోని మల్కాపూర్, ఆలూర్ గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, నాయకులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఆలూర్ ఎంపీటీసీ యాదమ్మ, నాయకులున్నారు. భీంభరత్, సత్యనారాయణరెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని గెలిపించాలి : తాండూరు ఎమ్మెల్యే

తాండూరు రూరల్ : రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. నారాయణపూర్, వీర్‌శెట్టిపల్లి, గోనూరు, చెనిగేష్‌పూర్, ఎల్మకన్నె, ఓగీపూర్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్, బెల్కటూర్, చింతామణిపట్నం, పర్వతాపూర్, చెంగోల్, గౌతాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగప్ప, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, తదితరులున్నారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు సీఎం రేవంత్‌రెడ్డివైపే చూస్తున్నాయని, ఎన్నికల యుద్ధానికి మనమందరం సిద్ధంగా ఉండాలని రంజిత్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం మండల కేంద్రంలో ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. జడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, కేఎల్లార్, భాస్కర్‌రెడ్డి, పారిజాతనర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రఘుమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

మహేశ్వరం : కార్యకర్తలను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో తుక్కుగూడలో కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

పదేళ్లు అధికారంలో ఉన్నా అభివృద్ధి శూన్యం

షాబాద్/మొయినాబాద్ : దేశంలో ఎన్డీయే ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉన్నా అభివృద్ధి శూన్యమని ఎంపీ రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి అన్నారు. షాబాద్ మండలంలోని కేసారం, కక్కులూర్, సర్దార్‌నగర్, కుర్వగూడ ఇంటింటి ప్రచారం చేశారు. పీసీసీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, తదితరులున్నారు. సీతారెడ్డి కారును సర్దార్‌నగర్, కుర్వగూడ గ్రామాల మధ్య పోలీసులు తనిఖీ చేశారు. మొయినాబాద్ మండలం అప్పారుడ్డిగూడ, తోల్‌కట్ట, నక్కలపల్లి, కేతిరెడ్డిపల్లిలో పామెన భీంభరత్‌తో కలిసి సీతారెడ్డి ప్రచారం చేశారు. అప్పారెడ్డిగూడ మాజీ సర్పంచ్ తనయుడు కరన్ కాంగ్రెస్‌లో చేరారు.


చేవెళ్ల : బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న రంజిత్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి

శంకర్‌పల్లి/మర్పల్లి/పూడూరు : కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ కార్యదర్శి ఉదయ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శంకర్‌పల్లి మండలం అలంకానిగూడ, చిన్నారెడ్డిగూడ, గాజులగూడ తదితర గ్రామాల్లో రంజిత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. మర్పల్లి పీఏసీఎస్ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి మండలంలోని పంచలింగాలలో నాయకులతో కలిసి ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డిని గెలిపించుకుందామని పూడూరు మండల నాయకులన్నారు. పుడుగుర్తిలో ప్రచారం చేశారు.

తల్లిదండ్రులు, భార్య, పిల్లల మీద ఒట్టేసి చెబుతున్నా.. రంజిత్‌రెడ్డిని గెలుపు కోసం కృషి చేస్తా : స్పీకర్


మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : నా తల్లిదండ్రులు, భార్య, పిల్లల మీద ఒట్టేసి చెబుతున్నా.. రంజిత్‌రెడ్డి గెలుపుకోసం కృషి చేస్తానని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సింగ్ గౌలీకార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ బూత్ కార్యకర్తల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. రంజిత్‌రెడ్డి గెలుపొందేలా కృషిచేస్తానని, మీరు కూడా రంజిత్‌రెడ్డి విజయానికి కృషిచేయాలని నాయకులకు, బూత్ ఇన్‌చార్జిలకు పిలుపునిచ్చారు. కాగా, చేవెళ్ల నుంచి రంజిత్‌రెడ్డిని గెలిపిస్తే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు.

రంజిత్‌రెడ్డి గెలుపు బాధ్యత మనదే

రంజిత్‌రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి అన్నారు. రంజిత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకురావడంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు తాను, స్పీకర్ ప్రసాద్‌కుమార్ పాత్ర ఉందన్నారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, ఇక్కడ పోటీలో ఉంటారనుకున్న సునీతమ్మను మల్కాజ్‌గిరికి రేవంత్‌రెడ్డి బలమైన నాయకులు కావాలనే తీసుకెళ్లడం జరిగిందని ఆయన అన్నారు.

కొండాకు రిటైర్మెంట్ ఇవ్వండి : రంజిత్‌రెడ్డి

సమస్యల నిమిత్తం వెళ్లినవారిని అపాయింట్‌మెంట్ అడిగిన వ్యక్తిని రిటైర్మెంట్ చేసే అవకాశం మీ చేతుల్లో ఉందని రంజిత్‌రెడ్డి అన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తాను ఎంపీగా ఐదేళ్లు అధికారంలో ఉన్నామని, ఎవరూ ఏం చేశారో ప్రజలకు తెలుసని అన్నారు. అనంతపద్మనాభ స్వామి మీద ఒట్టు.. తాను ఎలాంటి తప్పు చేయలేదన్నారు. తనపై ఆరోపణలు చేసేవారు ఆధారాలుంటే రుజువు చేయాలన్నారు. వికారాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి యాదవరెడ్డి మాట్లాడుతూ పార్టీలోకి వచ్చేవారిని స్వాగతించాలన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను నామరూపాల్లేకుండా చేయడమే లక్ష్యం

- డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి
- అంతాయిపల్లి సమీపంలో బహిరంగసభ ఏర్పాట్ల పరిశీలన


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి

శామీర్‌పేట, ఏప్రిల్ 20 : రాష్ట్రంలో అనేక అక్రమాలకు పాల్పడి విధ్వంసం సృష్టించిన బీఆర్ఎస్‌ను నామరూపాల్లేకుండా చేసి ప్రజలకు చేయూత నివ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం శామీర్‌పేట మండలం అంతాయిపల్లి సమీపంలో రేపు(సోమవారం) కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగసభ ఏర్పాట్లను నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పట్నం సునీతమహేందర్‌రెడ్డి నామినేషన్ వేసిన అనంతరం భారీ బహిరంగ సభను లక్ష మందితో నిర్వహించనున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలు, కుంభకోణాలకు పాల్పడిందని, వాటన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం వెలికి తీసి తగిన శిక్ష వేస్తుందన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మేడ్చల్ నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిరంగసభను విజయవంతం చేసి సునీతమహేందర్‌రెడ్డిని గెలిపించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. మండలాధ్యక్షుడు వైఎస్ గౌడ్, తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం



షాద్‌నగర్‌అర్బన్, ఏప్రిల్ 20: షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ పూజారులు, వేద పండితులు శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. రిటైర్డ్ ఎఎస్పీ యాదయ్య దంపతులతో పాటు పట్టణ ప్రముఖులు హాజరయ్యారు.

ప్రజాధనం దుర్వినియోగం

- పట్టపగలు వెలుగుతున్న వీధిదీపాలు
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు


గేట్‌వనంపల్లిలో పట్టపగలు వెలుగుతున్న విద్యుద్దీపాలు(సర్కిళ్లలో..)

నవాబుపేట, ఏప్రిల్ 20: ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీల్లో ప్రజా ధనం దుర్వినియోగమవుతోంది. మండలంలోని గేట్‌వనంపల్లి గ్రామంలో పగలు, రాత్రి తేడా లేకుండా వీధిలైట్లు వెలుగుతున్నాయి నెల రోజులుగా గ్రామం మొత్తం పగలు, రాత్రి తేడా లేకుండా 24 గంటల పాటు 52 విద్యుత్ స్తంభాలకు దీపాలు వెలుగుతున్నాయి. సర్పంచ్‌ల పాలనలో గ్రామాల్లో ఇలాంటి సమస్యలు ఏర్పడలేదని, ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. సమస్యల పరిష్కరించడంలో పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వహిస్తున్నారని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు

- నాలుగు లేన్లు.. మధ్యలో డివైడర్
- ఇరువైపులా కాలువల నిర్మాణం
- ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు


విస్తరణ పనులను సమీక్షిస్తున్న ఎస్‌ఈ వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 20: షాద్‌నగర్ చౌరస్తా నుంచి జాతీయ రహదారి వైజంక్షన్ వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ బి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్ మోహన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ రవీంద్రకుమార్, జేఈ రాజశేఖర్‌లతో రోడ్డు విస్తరణపై సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రూ.45 కోట్ల అంచనా వ్యయంతో షాద్‌నగర్ నుంచి జాతీయ రహదారి వైజంక్షన్ వరకు నాలుగు లేన్ల రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే కొత్తూర్ వద్ద మిగిలిన పనులను కూడా పూర్తి చేయిస్తామన్నారు. షాద్‌నగర్ చౌరస్తా నుంచి వై జంక్షన్ వరకు రోడ్డు మధ్యలో రెండు మీటర్ల డివైడర్ వస్తుందని, ఇరువైపులా 8.75 మీటర్ల బీటీ రోడ్డును నిర్మిస్తామని తెలిపారు. మురుగునీటితో పాటు వర్షపు నీరు పోవడానికి రోడ్డుకు ఇరువైపులా కాలువలను నిర్మిస్తామని తెలిపారు. కాలువల తర్వాత కూడా మరో 25 ఫీట్ల స్థలాన్ని సర్వీసు రోడ్డు కోసం వదులుతున్నామని అన్నారు. అందరి సహకారం ఉంటే ఏడాదిలో నిర్మించాల్సిన పనులు ఆరు నెలల్లోనే పూర్తవుతాయని వెంకటేశ్వర్‌రావు తెలిపారు.


రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు గడ్డలను తొలగిస్తున్న దృశ్యం

శంకర్‌పల్లి ఎమ్మార్వో కార్యాలయానికి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి


ఎమ్మార్వో కార్యాలయం వద్ద కిరణ్‌కుమార్‌రెడ్డి

శంకర్‌పల్లి, ఏప్రిల్ 20 : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. జన్వాడలో ఆయనకు 1-20 ఎకరాల భూమి ఉండగా దానిని అమ్మేశారు. ఆ భూమి కొన్న వారికి రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆయన ఆ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ సురేందర్ రిజిస్ట్రేషన్ తంతు పూర్తి చేశారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్ వెళ్లిపోయారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి కార్యాలయానికి వచ్చిన విషయం తెలుసుకున్న స్థానికులు, పలువురు నాయకులు కార్యాలయానికి వచ్చి ఆయనతో ఫొటోలు దిగారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


మొక్కజొన్న చేనును పరిశీలిస్తున్న ఏవో

చేవెళ్ల, ఏప్రిల్ 20 : రెండు రోజుల క్రితం వచ్చిన ఈదురుగాలులు, అకాల వర్షానికి మండలంలో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి తులసీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని ధర్మసాగర్‌లో ఈదురు గాలులకు ఏడు ఎకరాల్లో బొప్పాయి పంట నష్టం జరిగిందన్నారు. కమ్మెటలో మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగిందని చెప్పారు. మిగితా గ్రామాల్లో ఎక్కడా పంట నష్టం జరగలేదన్నారు. దెబ్బతిన్న పంటల వివరాలకు సేకరించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఈవో రమేశ్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్‌డేలో చిన్నారులు, టీచర్లు

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 20 : మండల పరిధిఎన్కేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ 1వ కేంద్రంలో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ చిన్నతనంలోనే పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లల అభివృద్ధి పుస్తకం, ప్రీస్కూల్ సర్టిఫికెట్లను పిల్లల తల్లిదండ్రులకు ఆమె అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోనే చిన్నారులకు పాఠశాలపై అవగహన కలుగుతుందని, ఇది వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అరుణ, మంగమ్మ, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజమల్లేష్


రాజమల్లేష్

మొయినాబాద్ ఏప్రిల్ 20 : భారతీయ జనతాపార్టీ యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిన్నమంగళారం అనుబంధ గ్రామమైన వీరన్నపేట్‌కు చెందిన బట్టు రాజమల్లేష్ నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కనర్సింహారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్ జారీ చేసినట్లు రాజమల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అభివృద్ధి కోసం , పార్టీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి కృషిచేస్తానని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృసి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, ఏప్రిల్ 20 : మండల పరిధిలోని బాలాజీ నగర్ తండా సమీపంలో గల ధనరాశి పర్వతం పై ఉన్న శ్రీరాధాకృష్ణ దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. నాలుగు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ధర్మకర్త రామావత్ బీచ్యానాయక్ బావోజీ, ఆధ్వర్యంలో భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరాధన, చక్రతీర్థం, మహాపూర్ణాహుతి, పుష్పయాగం, ద్వాదశ ఆరాధన, దేవతా ఉద్వాసన, మహదాశీర్వాదం, ప్రత్యేకపూజలు, హోమం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కమ్లీబీచ్యానాయక్, గుర్కా కృష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యుడు డాక్టర్ రాంచందర్ నాయక్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


నాభిశిల పూజల్లో పాల్గొన్న గ్రామస్థులు

ఘనంగా నాభిశిల వార్షికోత్సవాలు

ఆమనగల్లు : మండలంలోని ఆకుతోటపల్లిలో శ్రీ నాభిశిల ద్వితీయ వార్షికోత్సవాలు శనివారం గ్రామస్థులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ గ్రామస్థులు సొంతూరుకు తరలి రావడంతో ఆకుతోటపల్లిలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వార్షికోత్సవానికి మాజీ సర్పంచ్ శ్రీపాతి రజితశ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేడుకలు కొనసాగగా, విఘ్నేశ్వర పూజ, హోమాలు, బొడ్రాయిపూజలు నిర్వహించారు. మహిళలు బోనం కుండలను ఎత్తుకొని ర్యాలీగా ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నిట్ట మంగమ్మనారాయణ, మండల కో-ఆప్షన్ సభ్యుడు హాజిపాష, స్థానిక నాయకులు శ్రీపాతి జైపాల్ రెడ్డి, కొండల్ రెడ్డి, బాలు, జంగారెడ్డి, శేఖర్, మాజీ ఉప సర్పంచ్ శేఖర్‌గౌడ్, సత్యం, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

కేశంపేట ఏప్రిల్ 20: కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేసి తమ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి ని గెలిపించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కేశంపేట మండలం బైర్కాన్‌పల్లిలోని తెట్టికుంట తండాలో ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పని చేసిన వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని, వారికి అన్ని రకాలుగా అండగా ఉంటుందని తెలిపారు. పార్టీ అభివృద్ధి చెందుతున్నందున పలువురు విభేదాలు సృష్టిస్తారని వాటిని పట్టించుకోకుండా పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వై. యాదయ్య యాదవ్, అల్వాల ఎంపీటీసీ సురేష్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేష్, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు రూప్లానాయక్, జగదీశ్వరప్ప, శ్రీధర్‌రెడ్డి, యాదగిరిచారి, గిరిధర్, అంజయ్య, కుమార్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు గోస పట్టించుకోని ప్రభుత్వం


తుక్కుగూడలో మాట్లాడుతున్న సబిత

కందుకూరు, ఏప్రిల్ 20 : రాష్ట్రంలో రైతుల గోసను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. సోమవారం మండలంలోని దాసర్లపల్లి తాండలో పర్యటించిన ఆమెకు ఓ గిరిజన రైతు జగ్గునాయక్ తన సమస్యలను వివరిస్తూ విలపించాడు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ రైతులను ఆదుకోని అసమర్థ ప్రభుత్వం రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీల ప్రకారం రెండు లక్షల రుణ మాఫీని చేయకుండా, 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయక పోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ టి. ఇందిరదేవేందర్, మాజీ సర్పంచ్ బి. బాలమణిఅశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెసోళ్ల మాటలు నమ్మొద్దు

మహేశ్వరం : నియోజకవర్గంలో బీఆర్ఎస్ పని అయిపోయిందంటున్న కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు నమ్మొద్దని, ఒకరిద్దరు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు నష్టమేమీ లేదని మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ముఖ్యనాయకుల సమావేశం మున్సిపల్ అధ్యక్షుడు జెల్లల లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్ గెలుపు కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బాట సురేష్, యు. శ్రీనివాస్, పి. సురేష్, యాదగిరి, సప్పిడిరాజు, సామేల్‌రాజు, ప్రభాకర్, వీరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

● కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

మాడ్గుల, ఏప్రిల్ 20 : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, తమ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వాసవి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీలను అమలు చేయబోతున్నారని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాగర్‌కర్నూల్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే చేయి గుర్తుపై ఓటు వేసి మల్లును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గౌరవరం ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాలుష్య నివారణ సంస్థ సభ్యుడు ఠాగుర్ బాలాజీ సింగ్, ఎంపీపీ పద్మ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, మాజీ ఎంపీపీ నూదిని రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

● రామేశ్వరంలో తెలుగు తమ్ముళ్ల పూజలు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 20 : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను షాద్‌నగర్‌లో టీడీపీ నాయకులు శనివారం ఘనంగా జరుపుకున్నారు. మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన రామలింగేశ్వర స్వామి ఆలయంలో చంద్రబాబు గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశానికి సేవలు చేసేందుకు ఆయనకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గందం ఆనంద్, వెంకటయ్య గౌడ్, శ్రీను, రాజు, శంకరయ్య, అనంతయ్య, యాదయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్ రూరల్ : పూజలు చేస్తున్న నాయకులు


మొయినాబాద్ రూరల్ : కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో..

మొయినాబాద్ రూరల్ : ఎన్టీఆర్ ఆయన ఆశయసాధన కోసం నిరంతరం పరితపిస్తున్న వ్యక్తి ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు అన్నారు. శనివారం చంద్రబాబు జన్మదినం సందర్భంగా మండల పరిధిలోని హిమాయత్ నగర్‌లో గల ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో ఆయన జన్మదిన వేడుకలను సిబ్బందితో కలిసి ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా డీన్ రామారావు మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ ఏ విధంగా ముద్ర వేసుకున్నారో చంద్రబాబు కూడా అదే రీతిలో పనిచేస్తున్నారని చెప్పారు. ఇలాంటి వ్యక్తులు మనందరికి ఎంతో ముఖ్యమని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఆమనగల్లు, ఏప్రిల్ 20 : ఆమనగల్లు పట్టణానికి చెందిన పీఏసీఎస్ కంప్యూటర్ ఆపరేటర్ తలారి మహేశ్ తండ్రి తలారి రామలింగయ్య అనారోగ్యంతో మృతి చెందగా, మృతదేహాన్ని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దోనాదుల సత్యం సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.ఏడు వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ సీఈవో దేవేందర్, సిబ్బంది పద్మాకర్‌రెడ్డి, సురేష్, రమేశ్ తదితరులు ఉన్నారు.

●తలకొండపల్లి : మండల పరిధిలోని వెల్జాల గ్రామానికి చెందిన దుబ్బ పెద్దయ్య అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబాన్ని శనివారం మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ. మూడు వేలు ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు యాదయ్య, పెంటయ్య, భాస్కర్, శ్రీకాంత్, బుచ్చయ్య, అభిలాష్, జగన్, తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి , ఏప్రిల్ 20 : నిరుపేదల ఇళ్ల నిర్మాణానికి తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. ఎడవెల్లి గ్రామానికి చెందిన దుర్గాపురం సత్యనారాయణ ఇంటి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. చేయూతనందించాలని అతను వెంకటేశ్‌ను ఆశ్రయించగా స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అవసరమైన మెటీరియల్‌ను సమకూర్చి శనివారం స్థానిక నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిష్టమ్మ, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు లింగయ్య, మల్లేశ్, లక్ష్మమ్మ, పుల్లమ్మ తదితరులు ఉన్నారు.

రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ వల్లే ప్రమాదాలు


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

శంషాబాద్, ఏప్రిల్ 20 : రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదాలు జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోవడం, క్షతగాత్రులై జీవితాంతం బాధపడుతున్నారని ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం అన్నారు. శనివారం శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపిన పలువురి వాహనాలను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ ప్రమాదాలు నివారించడానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టి రాంగ్‌రూట్‌లో వాహనాలు నడిపిన 38 వాహనాలు సీజ్ చేశామని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన పలువురికి జరిమానా విధించామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

బీజేపీ విజయం ఖాయం


ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

యాచారం, ఏప్రిల్ 20 : లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరిలో బీజేపీ విజయం ఖాయమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తాండ్ర రవీందర్ అన్నారు. శనివారం మండలంలోని మొండిగౌరెల్లిలో కార్యకర్తలతో కలిసి ఉపాధి కూలీలను కలిసి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తోందని చెప్పారు. బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిరావాలి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 20: కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నేడు (ఆదివారం) నామినేషన్ వేస్తున్నారని, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. భువనగిరి పట్టణంలో జరిగే ఈ నామినేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నారని ఆయన చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో కార్యకర్తలు ర్యాలీగా బయల్దేరుతారని ఆయన తెలిపారు.

లయన్స్ క్లబ్ 320ఏ ఫస్ట్ వైస్ గవర్నర్‌గా డా.జి.మహేందర్‌కుమార్‌రెడ్డి



మహేందర్‌కుమార్‌రెడ్డిని ప్రకటిస్తున్న దీపారెడ్డి

కందుకూరు. ఏప్రిల్ 20 : లయన్స్ క్లబ్ 320ఏ ఫస్ట్ వైస్ గవర్నర్‌గా లయన్స్ క్లబ్ కందుకూరు మండల వ్యవస్థాపక అధ్యక్షుడు డా.జి. మహేందర్‌కుమార్‌రెడ్డి ఆ సంస్థ 8వ వార్షిక సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మదన్‌గోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 84 క్లబ్‌లు, 3వేల పైచిలుకు సభ్యులున్న క్లబ్‌కు తాను ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బాధ్యతగా పనిచేస్తానని చెప్పారు. సమాజంలో పేదలకు సేవలందించి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి, నిమ్మ అంజిరెడ్డి, జి.దీపారెడ్డి, తీగల జగదీశ్వర్‌రెడ్డి, రామన్‌బాబు, టి.అంజయ్య తదితరులు పాల్గొన్నారు

ఆడబిడ్డ పెళ్లికి సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న దశరథ్ నాయక్

కడ్తాల్, ఏప్రిల్ 20 : ఓ ఆడబిడ్డ పెళ్లికి చేయూత నందించి కడ్తాల జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ ఉదారం చాటుకున్నారు. మండల కేంద్రానికి చెందిన శరణప్పసంతోష దంపతుల కూతురు స్నేహ వివాహం నేడు జరుగబోతుంది. ఆడబిడ్డ పెళ్లి ఖర్చుల కోసం వారి ఇబ్బందిని తెలుసుకున్న జడ్పీటీసీ, జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. ఇరవై ఒక్క వేలు సమకూర్చి శనివారం మండల కేంద్రంలో వారికి నగదు, పట్టు చీరను కానుకగా అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, హరిచంద్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ, నాయకులు నర్సింహ్మా, కృష్ణ, అంజి, శ్రీకాంత్, మహేశ్, గణేశ్, టీక్‌లాల్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం చోరీ

యాచారం, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలో ఓ టైలర్ షాప్ ముందు నిలిపిన ఓ ద్విచక్ర వాహనం చోరీ అయిన ఘటన శనివారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన రాము అనే వ్యక్తి తన ఏపీ 11 ఏజె 5743 నెంబర్ గల ద్విచక్ర వాహనాన్ని ఎప్పటి మాదిరిగానే శుక్రవారం రాత్రి కూడా యాచారంలోని టైలర్ షాప్ ముందు ఆపి వెళ్లాడు. శనివారం ఉదయం లేచి చూసే సరికి ఆ ద్విచక్రవాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. గత వారం కూడా ఓ ఇంటి ముందు నిలిపిన మరో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

ఈతకు వెళ్లి.. పుష్కరిణిలో పడి.. ఒకరి గల్లంతు

● గజ ఈతగాళ్లతో గాలింపు


పుష్కరిణిలో మృతదేహం కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

చేవెళ్ల, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయ పుష్కరిణిలో ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి అందులోనే మునిగి గల్లంతైన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వీరబ్రహ్మం తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా కుసోం గ్రామానికి చెందిన రవి(30) అనే వ్యక్తి షాబాద్ మండల పరిధిలోని ఎట్ల ఎర్రవల్లి గ్రామంలో మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం రవి అతని స్నేహితులు శ్రీనివాస్, రాజుతో కలిసి చేవెళ్లకు వచ్చాడు. స్నానం చేసేందుకు చేవెళ్ల పుష్కరిణిని వద్దకు వచ్చారు. రవికి ఈత కొడుతూ లోపలికి వెళ్లాడు. శ్రీనివాస్, రాజు ఒడ్డున మునిగి బయటకు వచ్చారు. పుష్కరిణి చివరి వరకు వెళ్తానని ఈదుకుంటూ ముందుకెళ్లాడు. అంతలోనే అతనికి ఆయాసం వచ్చి నీటిలో మునిగిపోయాడు. అతని స్నేహితులు శ్రీనివాస్, రాజు కేకలు వేసినా ఎవరు రాకపోవడంతో చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. చీకటి కావడంతో వెతికే ప్రయత్నం చేయలేదు. శనివారం ఉదయం పోలీసులు నలుగురు గజ ఈతగాళ్లను పిలిపించి పుష్కరిణిలో గాలించినా, రవి మృతదేహం దొరకలేదు. అతని కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరకుని విలపించారు. ఆదివారం ఉదయం వరకు రవి మృతదేహం బయటకు తేలే అవకాశం ఉందని ఎస్సై వీరబ్రహ్మం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ఉపేందర్ (ఫైల్‌ఫోటో)

చేవెళ్ల, ఏప్రిల్ 20 : కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతు మృతిచెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో జరిగింది. ఎస్సై వీరబ్రహ్మం, గ్రామస్థులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామానికి చెందిన పి. ఉపేందర్(21) అనే యువకుడు గ్రామంలోనే ఓ టెంట్‌హౌస్‌లో పని చేస్తున్నాడు. కాగా శుక్రవారం పెట్రోల్ కోసం చేవెళ్లకు వచ్చి తన బైక్‌లో పెట్రోల్ పోయించుకుని తిరిగి ఇంటికి వెళుతున్నాడు. మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లి గ్రామ స్టేజీ వద్ద ఉన్న యూటర్న్ వద్దకు రాగానే చేవెళ్ల నుంచి అతివేగంగా వస్తున్న ఓ కారు వచ్చి అతని బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఉపేందర్ తలకు తీవ్రగాయలు కావడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి అతన్ని తరలించారు. అక్కడే చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన ఉపేందర్ అవయావాలు దానం చేసేందుకు అతని కుటుంబ సభ్యులు ముందుకు రావడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి అవయావాలను దానం చేశారు.

అక్రమంగా భూమిలోకి ప్రవేశించిన ముగ్గురిపై కేసు

ఆదిబట్ల, ఏప్రిల్ 20 : వ్యవసాయ భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన ముగురు వ్యక్తులపై ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం గంగవరపు సుశీలమ్మ అనే మహిళ నలభై సంవత్సరాలుగా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామంలో సర్వే నెంబర్605/3, 607/3లో గల వ్యవసాయ భూమిలో పండ్లతోట సాగు చేస్తోంది. కాగా ఈనెల 14న మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో జీ లక్ష్మీపద్మ, వెంకటయ్య, రఘుప్రసాద్ అనే వ్యక్తులు ఏపి 29 టీఏ 1775 నెంబరు గల టాటా ఏస్ వాహనంలో వచ్చి ఆమె భూమిలోకి ప్రవేశించి హద్దురాళ్లు, ఖడీలు పాతడాని ప్రయత్నం చేసినట్లు సుశీలమ్మ ఈనెల 17న ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. (ఈ భూమికి సంబంధించిన కేసు ప్రస్తుతం జిల్లా కోర్టులో పెండింగ్‌లో ఉంది.) బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యవసాయ భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన జీ లక్ష్మీపద్మ, వెంకటయ్య, రఘుప్రసాద్‌పై 447, 427, 506, ఆర్/డబ్ల్యూ 34 ఐపీసి సెక్షన్ ప్రకారం అదే రోజు పోలీసులు కేసు (ఎఫ్ఐఆర్ నెంబర్ 218/2024) నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడి పుట్టిన రోజున విషాదం

●క్వారీలో పడి ఇంటర్ విద్యార్థి మృతి

కీసర, ఏప్రిల్ 20: స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వచ్చిన ఓ విద్యార్థి క్వారీలో పడి మృత్యువాత పడిన ఘటన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి హరికృష్ణ, విజయలక్ష్మీ దంపతులు ఇసీఐఎల్ కమలానగర్‌లో స్థిరపడ్డారు. వీరి కూతురు ఉన్నత చదువుల నిమిత్తం ఆమెరికాలో ఉండగా కూమారుడు అభినవ్(18) ఇటీవల ఇసీఐఎల్‌లో శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాశాడు. శుక్రవారం తన స్నేహితుడు నిరంజన్ పుట్టిన రోజు ఉందని చెప్పి అభినవ్ ఇంట్లో నుంచి వెళ్లాడు. స్నేహితులు ఆకాష్, నిరంజన్, చరణ్‌తో కలిసి అభినవ్ ఓలా క్యాబ్‌లో కీసర మండల పరిధి యాద్గార్‌పల్లిలోని అండర్ ది మూన్ రిసార్ట్‌కు వచ్చారు. వారంతా కలిసి సరదాగా ఫొటోలు, సెల్ఫీలు దిగి, భోజనాలు చేశారు. సాయంత్రం వరకు సరదాగా గడిపిన వారు రిసార్ట్ పక్కన యాద్గార్‌పల్లి- అంకిరెడ్డిపల్లి మధ్యన ఉన్న క్వారీని చూసి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈ క్రమంలో హఠాత్తుగా అభినవ్ క్వారీలో మధ్యలోకి వెళ్లి నీటమునిగాడు. గమనించిన స్నేహితులు అభినవ్‌ను కాపాడేందుకు ప్రయత్నించగా ఫలితం లేకుండా పొయింది. ఈ మేరకు స్నేహితులు స్థానికులకు, కుటుంబసభ్యులకు సమాచార ఇవ్వగా, వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని అభినవ్‌ను వెతికే ప్రయత్నం చేయగా, చీకటి పడింది. దీంతో పోలీసులు శనివారం గజఈతగాళ్ల సాయంతో అభినవ్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటయ్య తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కులకచర్ల, ఏప్రిల్ 20 : సంతానం కలగడం లేదని మనస్తాపానికి గురైన ఓ వివాహిత పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కుసుమ సముద్రం గ్రామానికి చెందిన ఎండీ.షబ్బీర్ కూతురు సమీనా బేగం(35)కు హైదరాబాద్ వట్టిపల్లి ప్రాంతానికి చెందిన జాఫర్ షరీఫ్‌తో ఆరు ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇంకా సంతానం కలగలేదు. రంజాన్ సందర్భంగా భార్యా భర్తలిద్దరూ హైదరాబాద్ నుంచి కుసుమ సముద్రం వచ్చారు. జాఫర్‌షరీఫ్ తన భార్యను అక్కడే వదిలివెళ్లాడు. ఈ క్రమంలో సమీనాబేగం తనకు సంతానం కలగడంలేదని మనస్తాపానికి గురై గత బుధవారం ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పాలమూర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం రాత్రి మృతిచెందింది. మృతురాలి తండ్రి ఎండీ.షబ్బీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సత్యశీలా రెడ్డి తెలిపారు.